భారీగా దెబ్బతిన్న వరి, పత్తి

నూతనకల్ : ఇటీవల కురిసిన వర్షాలు మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో వరి, పత్తి పంటలకు భారీగా నష్టం మిగిల్చింది. బిక్కుమళ్ల గ్రామశివారులోని కొలిశెట్టి రాజయ్య కత్వ వరద ఉధృతికి బుధవారం తెగిపోవడంతో పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తాళ్లసింగారం గ్రామశివారులో రోడ్డు కోతకు గురికావడంతో పాటు వరి పొలాల్లో ఇసుక మేట వేసింది. ఆయా గ్రామాల్లో పత్తి పంట నేల వాలడంతో పాటు నీట మునిగాయి. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అంచనా వేయకపోవడంతో దెబ్బతిన్న పంటల వివరాలు తెలియరాలేదు. సుమారు 100ఎకరాల్లో వరి, 70ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నట్లు ఆయా గ్రామాలకు చెందిన రైతులు తెలిపారు.



నూతనకల్ : బిక్కుమళ్లలో వరద ఉధృతికి నేలవాలిన పత్తి పంట



నూతనకల్ : బిక్కుమళ్లలో తెగిన కొలిశెట్టి రాజయ్య కత్వ

నీట మునిగిన పంట పొలాలు

తుంగతుర్తి : ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు అలుగులు పోవడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా 12గ్రామాల్లో 600ఎకరాలకు పైగా పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 500ఎకరాల్లో వరి, 100 ఎకరాల్లో పత్తి నీట మునిగింది. ఎకరాకు రూ.25వేల చొప్పున పెట్టుబడి పెట్టామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాఠశాలలోకి చేరిన నీరు

మండల పరిధిలోని కర్విరాల ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి చెరువులా మారింది. వర్షపు నీరు నిల్వ ఉండడంతో విషపురుగులు సంచరిస్తుండడంతో పిల్లలు భయాందోళన చెందుతున్నారు. పాఠశాలలో చేరిన నీటితో రాకపోకలు సాగించడానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి పాఠశాలలో నీరు నిల్వకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



నూతనకల్ : తాళ్లసింగారంలో వరిపొలాల్లో వేసిన ఇసుక మేట



తుంగతుర్తి : అన్నారంలో నీటమునిగిన వరిపొలం

గుండ్లకుంట్ల చెరువు అలుగుతో వీధులు జలమయం



గుండ్లకుంట్ల చెరువు అలుగు పోస్తుండడంతో వీధిలో ప్రవహిస్తున్న నీరు



ఆర్‌కె గార్డెన్ సమీపంలో ఇళ్ల మధ్యలోనే నిలిచిన వరదనీరు



గుండ్లకుంట్ల చెరువు అలుగు పోస్తుండడంతో వీధుల్లో ప్రవహిస్తున్న వరద



సూర్యాపేటటౌన్ : పట్టణంలోని కుడకుడ గ్రామశివారులో గల గుండ్లకుంట్ల చెరువు మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి భారీ ఎత్తున వరద చేరడంతో అలుగు పోస్తుంది. ఈ అలుగు నీరు తమ్మటికుంట వీధుల గుండా పారుతుండటంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్తే నీటితో అవస్థలు పడుతున్నామని, అలుగు పోసినన్ని రోజులు ఇలాగే వీధుల్లో నీరు ప్రవహిస్తుందని వాపోయారు. రాత్రి పూట ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా.. ఇంట్లోకి రావాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలుగు నీరు వీధుల్లోకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే జిల్లా కేంద్రంలో పలు చోట్ల డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్ల మధ్యనే నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో సమీప ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి : మండలంలోని వెలుగుపల్లి నుంచి కేశవాపురం గ్రామానికి వెళ్లే మార్గంలోని బంధంవాగు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కేశవాపురంలో బంధం వాగును పరిశీలించి ఆయన మాట్లాడారు. వెలుగుపల్లి, కేశవాపురం మధ్య బ్రిడ్జి నిర్మాణం కోసం సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేయిస్తానని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతోనే కేశవాపురం గ్రామానికి ఇబ్బందులు కలిగాయన్నారు. కేశవాపురం గ్రామానికి ఇతర గ్రామాలతో రాకపోకలు నిలిచిపోయాయని, ఆ గ్రామంలో సుమారు 1500మంది చిక్కుకపోయారన్నారు. నియోజకవర్గంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుంటలు తెగిపోయాయని, కొన్ని గ్రామాలకు వరదల కారణంగా రాకపోకలు బంద్ అయ్యాయన్నారు. మానాయికుంట వద్ద ఓ మహిళ వరదలో కొట్టుకపోయి మృతి చెందిందని తెలిపారు. ప్రజలు భారీ ప్రవహాల గుండా ప్రయాణించవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కంఠమయ్య, టీపీసీసీ సభ్యుడు గుడిపాటి నర్సయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, జిల్లా నాయకులు తిరుమలప్రగడ కిషన్‌రావు పాల్గొన్నారు.



తుంగతుర్తి : కేశవాపురంలో బంధం వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

పాఠశాలలు, ఇళ్లు మునగకుండా చర్యలు

అర్వపల్లి : వర్షాలకు అర్వపల్లిలో పాఠశాలలు, ఇళ్లు మునుగుతున్నాయని, ఇక నుంచి అవి మునగకుండా తగు చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. వర్షాలకు అర్వపల్లి కేజీబీవీ, జెడ్పీహెచ్‌ఎస్, ఇళ్లు మునిగిపోవడంతో వాటిని బుధవారం ఆయన పరిశీలించారు. కొత్తగా కాల్వల నిర్మాణం కోసం సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కాల్వల నిర్మాణం విషయమై సంబంధిత జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, పీఆర్ డీఈ బాబూరావు, ఎంపీడీఓ పవన్‌కుమార్, ఎంఈఓ బాలునాయక్, ఏఈలు హరిస్వరూప్, శ్రీకాంత్, గిర్దావర్ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఓ నాగరాణి, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, బైరబోయిన మహరాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్ రెడ్డి, సైదులు, బైరబోయిన రామలింగయ్య, దాసరి సోమయ్య, పులిచర్ల ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ నీట మునిగిన కేజీబీవీ

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) భారీ వర్షాలకు మళ్లీ రెండోసారి జలమయమైంది. నాలుగురోజుల కిందట వర్షపు నీటితో నిండగా జిల్లా, మండల స్థాయి అధికారులు ఆ నీరు మొత్తం బయటికి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. రోజుల్లో తిరిగి తరగతులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మళ్లీ జలమయమైంది. హైస్కూల్ సమీపం నుంచి కేజీబీవీ వరకు దారితో పాటు కేజీబీవీ భవనం ఆవరణ నీటితో నిండిపోయాయి.



పాఠశాల అభివృద్ధికి పీడీ యాకయ్య కృషి

తుంగతుర్తి : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కొండగడ్డుల యాకయ్య రెండు సంవత్సరాలకుపైగా హెచ్‌ఎంగా పనిచేశారు. ఆయన పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా, పీడీగా పనిచేస్తూ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. దాతల సహకారంలో సుమారు రూ.3.50లక్షలతో ల్యాప్‌ట్యాప్‌లు, లైబ్రరీలో పుస్తకాలు, కంప్యూటర్లు, డ్రమ్స్, బీరువాలను కొనుగోలు చేసి పాఠశాలకు అందించారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతున్న తరుణంలో ఆయన ఉపాధ్యాయ బృందాన్ని తీసుకొని మండల కేంద్రంతో పాటు, చుట్టూ పక్కల గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థుల సంఖ్యను పెంచారు. అలాగే పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేశారు.



తుంగతుర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు కంప్యూటర్లు అందజేస్తున్న పీడీ యాకయ్య (ఫైల్)

భూసేకరణకు రైతులు సహకరించాలి : ఆర్డీఓ

అర్వపల్లి : మండలంలో వర్షాలకు లోతట్టు ప్రాంతాలలో ఉన్న ఇళ్లు, పాఠశాలలు మునగకుండా ఉండేందుకు సంత నుంచి చెరువు వరకు నిర్మించే కాల్వ భూసేకరణకు రైతులు, స్థానికులు సహకరించాలని సూర్యాపేట ఆర్డీఓ ఆర్.వేణుమాధవరావు కోరారు. వర్షాలకు స్థానికంగా పాఠశాలలు, ఇళ్లు మునిగిపోతున్న విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే జిల్లా అధికారులతో మాట్లాడి అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి కొత్తగా కాలువలు నిర్మించి నీరు నిల్వకుండా శాశ్వతంగా సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. దీంతో ఆర్డీఓ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, స్థానికులతో సమావేశాన్ని నిర్వహించారు. సంత వద్దనున్న కల్వర్టు నుంచి చెరువు వరకు కొత్తగా కాల్వను నిర్మించేందుకు భూసేకరణ చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. భూములు కోల్పోయిన రైతులకు తగిన నష్టపరిహారం చెల్లిస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. సమావేశంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎస్‌హెచ్ డీఈ ఎల్‌ఆర్.రవీందర్, నీటిపారుదల శాఖ ఏఈ హరిస్వరూప్, ఆర్‌ఐలు పాటి వెంకట్‌రెడ్డి, ప్రసన్న, ఎస్‌ఓ నాగరాణి, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, శిల్పిక, బైరబోయిన మహరాజు, సైదులు, రామలింగయ్య, యాదగిరి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వేణుమాధవరావు

బడిబాట పట్టించారు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో 2016లో ఇంగ్లిష్ మీడియం ప్రారంభించారు. దీంతో విద్యార్థుల సంఖ్య 110 నుంచి 250కి పెరిగింది. ముఖ్యంగా పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు ఉల్లెందుల సైదులు ఇతర ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేశారు. పాఠశాల ఆవరణ మొత్తం మొక్కలు నాటించారు. 5వ తరగతి పిల్లలకు గురుకులాలో ప్రవేశాల కోసం శిక్షణ ఇప్పించేవారు. గురుకులాల్లో సీటు వచ్చిన వారిని సొంత ఖర్చులతో తీసుకెళ్లి చేర్పించి వచ్చేవారు. సైదులు విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి 2018లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రస్తుతం సైదులు ఇదే మండలంలోని కోమటిపల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. సైదులు బదిలీ అయి వెళ్లే సందర్భంగా పిల్లలు కంట తడిపెట్టారు.



పిల్లలతో ఉపాధ్యాయుడు సైదులు (ఫైల్)

క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్

సూర్యాపేటటౌన్ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న క్విజ్ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ చింతల బాపూజీ అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ కెప్టెన్ డా.వెంకటేశులుతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 19వతేదీ నుంచి 21వరకు ఆన్‌లైన్‌లో గ్రూప్ క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.2లక్షలు, రెండో బహుమతి రూ.1.50వేలు, మూడో బహుమతి రూ.లక్ష అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రతిభ కలిగిన విద్యార్థులు తమ వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌బీఐ క్విజ్.ఇన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ధరావత్ సతీష్, అధ్యాపకులు రామారావు, చక్రవర్తి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలి

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ బాలునాయక్ కోరారు. మండలంలోని తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని ఆయన సూచించారు. సమావేశంలో మండల నోడల్ అధికారి కుంభం ప్రభాకర్, కాంప్లెక్స్ కార్యదర్శి వి.రవీందర్‌రెడ్డి, ఆర్‌పీలు వి.సైదులు, సీహెచ్.నాగరాజు, పి.మల్లయ్య, ఎన్.వెంకన్న, హెచ్‌ఎంలు ఉదయ్‌కుమార్, యాదమ్మ, సీఆర్‌పీ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి

పెన్‌పహాడ్ : విద్యలో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల రీసోర్స్ భవనంలో నిర్వహించిన ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వచ్చే నెలలో నిర్వహించనున్న నాస్ 24 పరీక్ష నిర్వహణ పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ప్రభాకర్, ఆర్పీలు నల్ల శ్రీనివాసులు, దార నాగయ్య, బైరెడ్డి భద్రారెడ్డి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా యాదయ్య



సూర్యాపేటటౌన్ : పట్టణంలో ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్ల యాదయ్య, ఉపాధ్యక్షుడిగా జానపాటి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా డి.విజయనాయక్, కోశాధికారిగా ధార పాండయ్య, ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా ఇంటర్ విద్యాధికారి భానునాయక్, ఎన్నికల అధికారిగా సైదులు వ్యవహరించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నాగారం : మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వస్థీయ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కె) ఆధ్వర్యంలో బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కె డాక్టర్ స్పందన మాట్లాడారు.కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కె డాక్టర్ గౌతం, ఎంపీహెచ్‌ఏ కె.గీత, ఫార్మసిస్ట్ సతీష్, హెచ్‌ఎం కేఎల్‌ఎన్ రావు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

మద్దిరాల : షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని కుంటపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని రేపోని గ్రామానికి చెందిన సుంకరి దేవేందర్ – లక్ష్మి దంపతులు బతుకు దెరువు కోసం మండలంలోని కుంటపల్లిలో గుడిసె ఏర్పాటు చేసుకోని కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. బుధవారం రాత్రి గుడిసెలో ఎవరూ లేని సమయంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో గుడిసెలో ఉన్న రూ.20వేల నగదు, తులం బంగారం, బియ్యం, వంట సామగ్రి, 18నాటుకోళ్లు, తదితర పత్రాలు పూర్తిగా బూడిదైనట్లు తెలిపారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

నాగారం : గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని స్థానిక ఎస్‌ఐ ఎం.ఐలయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో వినాయక మంటపాల ఏర్పాటుకు ఉత్సవ కమిటీ సభ్యులు ముందస్తుగా పోలీసుశాఖ అనుమతి తీసుకోవాలన్నారు. పోలీస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎం రవీందర్‌రెడ్డికి సన్మానం

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న రవీందర్‌రెడ్డి ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో ముందస్తుగా బుధవారం జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో అతడిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, ఎంఎన్‌ఓ, కాంప్లెక్స్ హెచ్‌ఎం కుంభం ప్రభాకర్, జెడ్పీహెచ్‌ఎస్, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం

తిరుమలగిరి : మండలంలోని జేత్యాతండాలో పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎర్రంశెట్టి యాదగిరి ఇటీవల బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో యాదగిరిని తోటి ఉపాధ్యాయులు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సాధిక్ హుస్సేన్, కాంప్లెక్స్ హెచ్‌ఎం అశోక్, సీఆర్పీ సోమేష్ పాల్గొన్నారు.

కాసరబాదను సందర్శించిన వ్యవసాయ విద్యార్థులు

సూర్యాపేట రూరల్: గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని ఓరియంటల్ యూనివర్సిటీ చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థులు కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్త ఆకుల నరేష్ ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేట మండలం కాసరబాద గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు పండించిన పంటలను పరిశీలించారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త నరేష్ పంట మార్పిడి చేయడం వలన జరిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. అనంతరం కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ

పెన్‌పహాడ్ : మండలంలోని చెట్లముకుందాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సింగం అంజయ్య, తంగెళ్లగూడెం గ్రామానికి చెందిన కాకునూరి వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మృతుల కుటుంబాలను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ పరామర్శించారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రక్తదానం చేయడం అభినందనీయం

సూర్యాపేట : రక్తదానం చేయడం అభినందనీయమని అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ బైరు వెంకన్నగౌడ్ అన్నారు. బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా పట్టణంలోని జనరల్ ఆసుపత్రిలో చిరంజీవి యూత్ ఆధ్వర్యంలో చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సుందర్, శారద, అశోక్ పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి కౌన్సిలింగ్

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని బాలెంల గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2024–25విద్యాసంవత్సరానికి గాను వివిధ గ్రూపులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో అందుబాటులో ఉన్న గ్రూపులు బీఏ, బీకాం కంప్యూటర్స్, బీకాం జనరల్, ఎంపీసీ, ఎంఎస్‌డీఎస్, బీజెడ్సీ, ఎంజెడ్సీ గ్రూపులలో మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి ఈనెల 5, 6తేదీల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూరై అర్హత కలిగిన విద్యార్థినులు సంబంధిత సర్టిఫికెట్లు తీసుకొని కళాశాలలో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

సన్మాన సభను విజయవంతం చేయాలి

సూర్యాపేట : హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 6న ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్లకు జరిగే సన్మాన సభకు ప్రైవేట్ ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని టీపీటీఎల్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ జె.నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఆరోగ్యశ్రీ, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలు నీటి మూటలు గానే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సైబర్ మోసాలకు గురికావొద్దు

సూర్యాపేటటౌన్ : సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికావొద్దని, విద్యార్థులు ఇంటర్‌నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని షీటీం ఎస్‌ఐ నీలమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని భవానీ నర్సింగ్ కళాశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు గంజాయి, సైబర్ నేరాలు, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సైబర్ నేరాలపై, షీటీమ్స్, గంజాయి, డ్రగ్స్, గుట్కా నిర్మూలనకు పటిష్టంగా పనిచేస్తున్నామన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీనంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మొబైల్ యాప్‌లలో వచ్చే అనవసర బ్లూ లింకులను క్లిక్ చేయవద్దన్నారు. టీ సేఫ్ యాప్ గురించి విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో షీ టీం సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐ మధునాయుడును సన్మానిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు

మద్దిరాల : మండల ఎస్‌ఐగా విధులు నిర్వహించిన ఎస్‌ఐ మధునాయుడు ఇటీవల బదిలీ కావడంతో బుధవారం స్థానికంగా సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ ఎం.వీరన్న పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నూతనకల్లు ఎస్‌ఐ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐకి సన్మానం

మండల పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న నాగయ్య బుధవారం ఉద్యోగ విరమణ పొందుతుండడంతో డీఎస్పీ రవికుమార్ స్థానికంగా ఏఎస్‌ఐ నాగయ్య దంపతులను పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ ఎం.వీరన్న, సైదులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఇరుగు సోమయ్య, అధ్యక్షుడు



ఉప్పు నాగయ్య, ప్రధాన కార్యదర్శి

నూతనకల్ : మండల కేంద్రంలో పీఆర్‌టీయూటీఎస్ మండల కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఇరుగు సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఉప్పు నాగయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా ధరావత్ శివయ్య, కార్యదర్శిగా సామ ఇంద్రారెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలుగా కోడి సమత, కార్యదర్శిగా ఎం.చిలకమ్మను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా నాయకులు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, చింతరెడ్డి రామలింగారెడ్డి, మహేశ్వరం వెంకటయ్య, చవగాని వెంకయ్యగౌడ్, మేడిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

సూర్యాపేట : అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఎం వన్‌టౌన్ కార్యదర్శి వల్లపుదాసు సాయికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విషజ్వరాలతో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తే ఫీజులు, టెస్టుల పేరుతో విపరీతంగా డబ్బులు గుంజుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ వన్‌టౌన్ కమిటీ సభ్యులు అర్వపల్లి లింగయ్య, కోడి ఎల్లయ్య తదితరులు ఉన్నారు.